సాక్షి పశ్చిమగోదావరి

సోమవారం । 12 । ఫిబ్రవరి । 2024



పంటకు త'రుణ'మిదే

పంటలకు రుణాల మంజూరుపై జిల్లా లీడ్ బ్యాంక్ స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రణాళిక విడుదల చేసింది.

8లో ▸



మార్మోగిన వాసవీ నామస్మరణ

వాసవీ కన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవాన్ని పెనుగొండలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

8లో ▸



చెరువులో పడి దుర్మరణం

చెరువులో పడి ఇద్దరు బాలురు దుర్మరణం పాలైన ఘటన సరిపల్లి గ్రామంలో చోటుచేసుకుంది.

8లో ▸

న్యూస్‌రీల్

బాలకృష్ణ శర్మకు గ్లోబల్ పురస్కారం



గ్లోబల్ గౌరవ్ పురస్కారం అందుకుంటున్న దృశ్యం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరుకు చెందిన గుడిమెట్ల బాలకృష్ణ కిషోర్‌శర్మకు ప్రతిష్టాత్మక గ్లోబల్ గౌరవ్ పురస్కారం లభించింది. న్యూఢిల్లీలోని ప్రగతి మైదాన్‌లో ఆలిండియా ఫెడరేషన్ ఆఫ్ ఆస్ట్రాలజర్స్ సొసైటీ (ఐఫాస్) ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన నక్షత్ర–2024 సదస్సులో ఆయన పురస్కారం అందుకున్నారు. దేశవ్యాప్తంగా జ్యోతిష్య శాస్త్రంపై పరిశోధనలు చేసి, జ్యోతిష్య శాస్త్ర అభివృద్ధికి విశేషంగా కృషి చేసిన పది మందికి పురస్కారం అందించగా రాష్ట్రం నుంచి బాలకృష్ణ శర్మ ఒకరు. రాజ్యసభ సభ్యుడు దీపక్ ప్రకాష్, ఐఫాస్ ప్రతినిధులు అరుణ్ కె.బన్సాల్, అభ బన్సాల్, తన్వి బన్సాల్ చేతులమీదుగా బాలకృష్ణశర్మ పురస్కారం అందుకుని సత్కారం పొందారు.

ప్రశాంతంగా ఇంటర్ ప్రాక్టికల్స్

భీమవరం: జిల్లాలో ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్ పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయని ఆర్ఐఓ కె.చంద్రశేఖర్‌బాబు ప్రకటనలో తెలిపారు. జనరల్ కోర్సులకు సంబంధించిన స్పెల్–1 పరీక్షతోపాటు ఒకేషనల్ కోర్సు స్పెల్–2 ఎఫ్ఎస్, ఏఎస్ పరీక్షలకు 4,976 మంది విద్యార్థులకు 4,867 మంది హాజరయ్యారన్నారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోలేదన్నారు.

పోలియో నిర్మూలన కమిటీ చైర్మన్‌గా మద్దాల



మద్దాల వాసుని అభినందిస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: రోటరీ క్లబ్ ఆఫ్ పాలకొల్లు మాజీ అధ్యక్షుడు మద్దాల వాసు రోటరీ ఇంటర్నేషనల్ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పోలియో నిర్మూలన కమిటీ చైర్మన్‌గా ఎంపికయ్యారు. విజయనగరం జిల్లా బొబ్బిలిలో ఆదివారం రోటరీ జిల్లా 3020 పరిధిలోని ఆరు జిల్లాల కమిటీ సభ్యులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రపంచవ్యాప్తంగా పోలియో నిర్మూలనకు రోటరీ క్లబ్ అత్యంత సమర్థవంతంగా పనిచేస్తుంది. బిల్‌గేట్స్ ఫౌండేషన్ పోలియో నిర్మూలనకు చేసే సహాయాన్ని రోటరీ ద్వారా నిర్వహిస్తున్న విషయం తెలిసిందే.

పంటల పరిశీలన



కోకో, కూరగాయల పంటలను పరిశీలిస్తున్న ప్రభుత్వ సలహాదారు తిరుపాలురెడ్డి

ద్వారకాతిరుమల: రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రభుత్వ సలహాదారు ఇరగంరెడ్డి తిరుపాలు రెడ్డి మండలంలోని కృష్ణాపురం, సుర్యచంద్ర రావుపేట, పంగిడిగూడెం గ్రామాల్లో పంటలను ఆదివారం పరిశీలించారు. సూర్యచంద్ర రావుపేటలోని ఆయిల్‌పామ్ తోటను పరిశీలించి, సాగులో మెలకువలను రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కొబ్బరి, కోకో, వక్క, జాజికాయ పంటలను ఒకే స్థలంలో వివిధ స్థాయిల్లో సాగు చేసే విధానాన్ని రైతు బలుసు వీరభద్రరావును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పంట దిగుబడి, రైతులు పండించే విధానం, పంటల విధి విధానాలను ఉద్యాన, వ్యవసాయ శాఖ అధికారులు ఆయనకు వివరించారు. జిల్లా ఉద్యాన అధికారి రామ్మోహన్‌రావు, భీమడోలు వ్యవసాయ శాఖ ఏడీ ఉషారాజకుమారి, జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయం ఏడీఏ శైలజ, మండల వ్యవసాయ అధికారి ఎ.దుర్గారమేష్, వీహెచ్ఎలు, వీఏఏలు ఉన్నారు.

శ్రీవారి సేవలో..

ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని ప్రభుత్వ సలహాదారు తిరుపాలురెడ్డి సందర్శించారు. ఆలయంలో స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు ఆయనకు శ్రీవారి శేషవస్త్రాన్ని కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలకగా, ఆలయ ఏఈఓ మెట్టపల్లి దుర్గారావు శ్రీవారి మెమెంటో, ప్రసాదాలను అందజేశారు.

చదువులమ్మ ఒడి.. చక్కదిద్దబడి

నాడు-నేడుతో మహర్దశ

- కార్పొరేట్ స్కూళ్లను తలదన్నేలా సర్కారీ బడులు
- తొలివిడతలో రూ.116.13 కోట్లతో 497 పాఠశాలల అభివృద్ధి
- రెండో విడతలో 653 పాఠశాలల్లో రూ.253.01 కోట్లతో పనులు
- అధునాతన వసతులు, తరగతి గదుల నిర్మాణం
- డిజిటల్ విద్యకు ప్రాధాన్యం

ఇదీ మార్పు

నాడు-నేడు పనులు

విడత	పాఠశాలల సంఖ్య	నిధులు రూ.కోట్లలో	పనులు
మొదటి	497	116.13	3,567
రెండో	653	253.01	3,113

రెండో విడత నాడు-నేడు పనులు ఇలా..

- 40 అంగన్‌వాడీ సెంటర్ల నిర్మాణం
- 164 బడుల్లో 356 అదనపు తరగతి గదుల నిర్మాణం
- 321 బడుల్లో ప్రహరీల నిర్మాణం (55 పూర్తి, 85 చివరి దశలో)
- 498 బడుల్లో టాయిలెట్స్ (496 చోట్ల పూర్తి)
- 374 బడుల్లో కిచెన్ షెడ్లు (366 చోట్ల పూర్తి)
- 501 బడుల్లో మేజర్, మైనర్ మరమ్మతులు (327 చోట్ల పూర్తి)
- 501 బడుల్లో విద్యుదీకరణ (488 బడుల్లో పూర్తి)
- 522 బడుల్లో తాగునీటి వసతి

సాక్షి, భీమవరం: పశ్చిమగోదావరి జిల్లాలో 1,075 ప్రాథమిక, 86, ప్రాథమికోన్నత, 211 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. విద్యారంగంలో సీఎం జగన్ విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారు. గత టీడీపీ హయాంలో కార్పొరేట్ రంగానికి పెద్దపీట వేసి ప్రభుత్వ పాఠశాలలను అథోగతి పట్టిస్తే.. మనబడి నాడు-నేడుతో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ విద్యకు కొత్త ఊపిరిలూదింది. ప్రాధాన్య క్రమంలో పాఠశాలలకు అభివృద్ధి చేసుకుంటూ వస్తున్నారు. జిల్లాలో ఇప్పటివరకు రెండు విడతల్లో 1,150 పాఠశాలల్లో రూ.369.11 కోట్లతో డిజిటల్ తరగతులు, తాగునీటి వసతి, టాయిలెట్స్, కిచెన్‌షెడ్లు, ప్రహరీ గోడలు, అదనపు తరగతి గదుల నిర్మాణం, విద్యుద్దీకరణ, మేజర్, మైనర్ మరమ్మతులు తదితర 6,680 అభివృద్ధి పనులు చేశారు. ఇప్పటికే మొదటి విడత నాడు-నేడు పనులు పూర్తికాగా రెండో విడత పనులు చురుగ్గా సాగుతున్నాయి.

● నాడు..



శిథిల భవనాలు, పెచ్చులు ఊడే పైకప్పులు, రాళ్లు పైకిలేచిన ఫ్లోరింగులు, కలుషిత తాగునీరు, అధ్వానంగా దుర్గంధం వెదజల్లే టాయిలెట్లు, రక్షణ గోడలు లేక అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిన పాఠశాలలు. ఇది గతంలో ప్రభుత్వ పాఠశాలల దుస్థితి.

● నేడు..



ఆధునిక వసతులతో నూతన భవనాలు, డిజిటల్ తరగతి గదులు, మినరల్ వాటర్ ప్లాంట్లు, టాయిలెట్స్ విత్ రన్నింగ్ వాటర్, విద్యుద్దీకరణ, పెయింటింగ్స్, అధునాతన ఫర్నీచర్, ప్రహరీ గోడలు, ఇంగ్లిష్ ల్యాబ్‌లు. ఇది జగనన్న పాలనలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి.

డిజిటల్ విద్యావెలుగులు





ఈ రెండు చిత్రాలను గమనించారా.. ఒక తరగతి గదిలో టేబుల్‌పై ట్యాబ్‌లతో విద్యార్థులు విద్యాభ్యాసం సాగిస్తుంటే.. మరో తరగతి గదిలో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ (ఐఎఫ్‌పీ)పై ఉపాధ్యాయుడు డిజిటల్ విద్యాబోధన చేస్తుండగా విద్యార్థులు ఆసక్తిగా తిలకిస్తున్నారు. ఇవి సంపన్నులు మాత్రమే చదివించగలిగే కార్పొరేట్ విద్యాసంస్థల్లో దృశ్యాలనుకుంటే పొరపాటే. మొదటిది ఆకివీడు జెడ్పీ హైస్కూల్ అయితే రెండవది మొగల్తూరు జెడ్పీ హైస్కూల్‌లో దృశ్యాలు. కార్పొరేట్ స్కూళ్లను తలదన్నేలా పేద విద్యార్థులు ప్రపంచంతో పోటీపడేలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కృషితో రాష్ట్రంలో ప్రభుత్వ విద్యావిధానంలో వచ్చిన విప్లవాత్మక మార్పులకు ఇవి నిదర్శనాలు.

విద్యకు అధిక ప్రాధాన్యం



ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యమిస్తుంది. ఈరోజు పేదింటి పిల్లలు అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రపంచస్థాయి విద్యావిధానాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేస్తున్నారు. మనబడి నాడు-నేడు కార్యక్రమంతో ఊహించని విధంగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నారు.

–ఆర్.వెంకటరమణ, జిల్లా విద్యాశాఖ అధికారి

అన్నీ మారిపోయాయి



నేను 6వ తరగతి నుంచి ఇదే స్కూల్లో చదువుతున్నాను. 7వ తరగతిలోకి వచ్చాక నాడు-నేడు పనులు చేపట్టి మొత్తం రూపురేఖలు మార్చేశారు. టాయిలెట్లు, క్లాస్‌రూమ్‌లు, బెంచీలు, సీలింగ్ ఫ్యాన్లు, లైట్లు, కాంపౌండ్ అన్నీ చేశారు. ఇంగ్లిష్ మీడియం పాఠాలు చెబుతున్నారు. క్రీడలను ప్రోత్సహిస్తున్నారు. నేను జిల్లాస్థాయిలో రాణిస్తే రాష్ట్రస్థాయి డిస్కస్‌త్రో పోటీలకు తీసుకువెళ్లారు.

– కదలి నాగ రిషిత, 9వ తరగతి, జెడ్పీ హైస్కూల్, ఎల్‌బీ చర్ల

స్కూల్ మానితే ఫోన్ వచ్చేస్తుంది



మా ఇద్దరు పిల్లలు చిన్నమామిడిపల్లి హైస్కూల్‌లో చదువుతున్నారు. నా భర్త కూలీ పనులకు వెళుతుంటారు. పిల్లలు ఏ కారణంతో అయినా ఆలస్యంగా వెళ్లినా, అనారోగ్యంతో బడి మానేసినా వెంటనే స్కూల్ నుంచి ఫోన్ వస్తుంది. స్కూల్‌ను చాలా బాగా అభివృద్ధి చేశారు. పిల్లలు కూడా క్రమం తప్పకుండా పాఠశాలకు వెళుతున్నారు. సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం.

– జెన్ని భారతి, విద్యార్థుల తల్లి, సరిపల్లి పద్మశ్రీ కాలనీ, నరసాపురం

నా పిల్లలు ప్రభుత్వ బడిలోనే..



ప్రభుత్వ పాఠశాలలను చూస్తుంటే చాలా ముచ్చటేస్తుంది. మేం చదువుకున్నప్పుడు ఇలాంటి వసతులు లేవు. టాయిలెట్స్ కూడా సరిగా ఉండేవి కాదు. ఇప్పుడు టాయిలెట్స్, ఆర్ఓ ప్లాంట్, విద్యుత్, సీలింగ్ ఫ్యాన్లు ఇతర వసతుల కల్పించారు. ఆహ్లాదకర వాతావరణంలో ఇంగ్లిష్ మీడియం బోధన చేస్తున్నారు. నా ఇద్దరు కుమార్తెలను ప్రభుత్వ బడిలోనే చదివిస్తున్నా.

– గోగులమంద చినకృష్ణమూర్తి, పూర్వ విద్యార్థి, యండగండి

కార్పొరేట్ సంస్థల కన్నా మెరుగ్గా..



ప్రైవేటు విద్యాసంస్థలో ఫిజిక్స్ ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నాను. కోవిడ్ తర్వాత మా అమ్మాయిలు ఇద్దరినీ బీవీఆర్ఎం బాలికోన్నత పాఠశాలలో చదివిస్తున్నాను. ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ విద్యాసంస్థలను తలపించేలా ఉన్నాయి. ఒకరకంగా చెప్పాలంటే కార్పొరేట్ స్కూళ్లలో లేని సదుపాయాలు కూడా ప్రభుత్వ పాఠశాలల్లో కనిపిస్తున్నాయి. అన్ని వసతులు కల్పించారు.

– కవురు దేవేంద్రకుమార్, ప్రైవేట్ ఉపాధ్యాయుడు, అడవిపాలెం

పెద్దింట్లమ్మ వారధి ప్రారంభం



వారధిపై వెళుతున్న మంత్రి కారుమూరి, ఎమ్మెల్యే డీఎన్నార్, ఎమ్మెల్సీ జయమంగళ, ఎంపీ అభ్యర్థి సునీల్‌కుమార్

కైకలూరు: దశాబ్దాల కొల్లేరు ప్రజల చిరకాల కల సర్కారు కాల్వపై పెద్దింట్లమ్మ వారధిని పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2009లో దివంగత వైఎస్సార్ వారధి నిర్మాణానికి రూ.12 కోట్లు కేటాయించారని, అయితే ఆయన మరణంతో పనులు నిలిచిపోయాయన్నారు. మరలా సీఎం జగన్ రూ.14.70 కోట్లను కేటాయించి వారధిని పూర్తి చేయడం కొల్లేరు ప్రజలకు శుభపరిణామమన్నారు. ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) విశేష కృషి చేసి వారధి నిర్మాణాన్ని పూర్తిచేశారన్నారు. రానున్న ఎన్నికల్లో కొల్లేరు ప్రజలు వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యే డీఎన్నార్ మాట్లాడుతూ తెలుగుదేశం పాలనలో కాంట్రాక్టరుకు బకాయిలను సైతం సీఎం జగన్ రూ.5 కోట్లు చెల్లించారని చెప్పారు. వారధి నిర్మాణంతో కొల్లేరు గ్రామాలకు రవాణా సౌకర్యం మరింతగా పెరుగుతుందన్నారు. అలాగే కొల్లేరు గ్రామాల్లో రోడ్లు నిర్మిస్తున్నామన్నారు. ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ మాట్లాడుతూ సీఎం జగన్ మాట తప్పని నైజం కలవారని, రానున్న ఎన్నికల్లో కొల్లేరు ప్రజలు ఆయనకు మద్దతుగా నిలిచి రుణం తీర్చుకోవాలన్నారు. వైఎస్సార్‌సీపీ ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్, ఎంపీపీ అడవి కృష్ణ, జెడ్పీటీసీ కుర్రేళ్ల బేబీ, కైకలూరు ఏఎంసీ చైర్మన్ చేబోయిన వీర్రాజు, సర్పంచుల సంఘ మండలాధ్యక్షుడు చెరుకువాడ బలరామరాజు, సర్పంచులు జయమంగళ కాసులు, బలే వెంకటరమణ, కొయ్య గంగయ్య, ఉలిసి వసంతకుమారి, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

యాదవులకు గుర్తింపునిచ్చిన సీఎం జగన్

- మంత్రి కారుమూరి నాగేశ్వరరావు
- ఏలూరులో యాదవ సంఘ కార్యాలయ భవనం ప్రారంభం



మంత్రి కారుమూరి, ఎమ్మెల్యే ఆళ్ల నాని, ఎంపీ అభ్యర్థి సునీల్‌కుమార్ యాదవ్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న దృశ్యం

ఏలూరు (టూటౌన్): రాష్ట్రంలో యాదవ సామాజికవర్గానికి తగిన గుర్తింపు, ప్రాధాన్యం, గౌరవం ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిదే అని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. స్థానిక అమీనాపేట ఏటిగట్టు ప్రాంతంలో రూ.14 లక్షలతో నిర్మించిన యాదవ సంఘ ఏలూరు జిల్లా కార్యాలయ భవనాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ఏలూరు, నరసారావుపేట ఎంపీ స్థానాలు, ఐదు ఎమ్మెల్యే సీట్లు యాదవులకు కేటాయించి సీఎం జగన్ పెద్దపీట వేశారన్నారు. వచ్చే ఎన్నికల్లో యావత్ యాదవ సామాజికవర్గం సీఎం జగన్ వెంట నడిచి ఆయన రుణం తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలో బీసీలకు రాజ్యాధికారం కల్పించే దిశగా సీఎం జగన్ కృషి చేస్తున్నారన్నారు. ఏలూరు నియోజకవర్గంలో తమ ప్రభుత్వంలో రూ.3,500 కోట్లతో అభివృద్ధి జరిగిందన్నారు. సీఎం జగన్ ఆశయాలకు అనుగుణంగా ఎమ్మెల్యే ఆళ్ల నాని ఏలూరు నియోజకవర్గంలో 21 బీసీ సంఘాలకు స్థలాలు, నిధులు కేటాయించి గొప్పతనాన్ని చాటుకున్నారని కొనియాడారు.

భవనానికి సొంత నిధులు : రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ నియోజకవర్గంలోనైనా నిర్మించే యాదవ సంఘ భవనానికి తన సొంత నిధులు రూ.10 లక్షలు అందజేస్తానన్నారు. ఏలూరులో నిర్మించే అన్ని బీసీ కులాల కమ్యూనిటీ హాలుకు ఎంపీ నిధుల నుంచి రూ.25 లక్షలు, యాదవ సంఘం ఏలూరు జిల్లా భవనం పై అంతస్తు నిర్మాణానికి రూ.10 లక్షలు ఇస్తానని ప్రకటించారు. దేశంలో అత్యధిక జనాభా కలిగిన యాదవులు మరిన్ని సామాజిక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

బీసీలకు పెద్దపీట: ఎమ్మెల్యే ఆళ్ల నాని మాట్లాడుతూ వార్డు సభ్యుడి నుంచి చట్టసభల్లో పదవుల వరకూ సీఎం జగన్ బీసీలకు ప్రాధాన్యమిస్తున్నారన్నారు. సీఎం జగన్‌ను మరోమారు ముఖ్యమంత్రి పీఠంపై కూర్చోబెట్టేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్ గెలుపునకు అంతా కృషి చేయాలన్నారు. వచ్చే ఎన్నికల్లో ఏలూరు ఎంపీ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ వైఎస్సార్‌సీపీ పాగా వేస్తుందన్నారు. యాదవ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లాకా వెంగళరావు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ యాదవులకు తగిన గుర్తింపు ఇచ్చి సీట్లు కేటాయించడం అభినందనీయమన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, మేయర్ షేక్ నూర్జహాన్, సాహిత్య మండలి చైర్పన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి, టీటీడీ బోర్డు సభ్యుడు నెరుసు నాగసత్యం, యాదవ సంఘం నాయకులు ఉక్కుసూరి గోపాలకృష్ణ, చిదరబోయిన శ్రీనివాసరావు, కిలారపు బుజ్జి, గొర్ల రామారావు, ఆకుల గంగాధరరావు, బొట్టా అజయ్‌కుమార్, కార్పొరేటర్లు, ఏఎంసీ చైర్మన్లు, యాదవ సంఘ ప్రముఖులు పాల్గొన్నారు.

చదరంగంతో మేధస్సు



బహుమతులు అందిస్తున్న ఎంపీ అభ్యర్థి ఉమాబాల

భీమవరం: విద్య, వైద్య రంగాలకు ఎనలేని సేవలందిస్తున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ కుటుంబం క్రీడారంగానికి తన వంతు సహకారం అందించడం అభినందనీయమని వైఎస్సార్ సీపీ నరసాపురం ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల అన్నారు. భీమవరంలో దివంగత గ్రంధి వెంకటేశ్వరరావు పేరిట జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఓపెన్ చెస్ పోటీల్లో విజేతలకు ఆదివారం బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చదరంగంతో జ్ఞాపకశక్తి పెంచుకోవచ్చన్నారు. పోటీలకు రాష్ట్రంలోని 20 జిల్లాల నుంచి 167 మంది క్రీడాకారులు హాజరుకాగా వారిలో 20 మంది విజేతలుగా నిలిచారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు గ్రంధి రవితేజ, పట్టణ అధ్యక్షుడు తోట భోగయ్య, చెస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.భీమారావు, జిల్లా అధ్యక్షుడు మాదాసు కిషోర్, తోట హరిబాబు, ఎం.మురళీ తదితరులు ఉన్నారు.

విజేతలు వీరే.. సింహాద్రి సాయిహృషికేష్, డి.సాత్విక్, కె.రాజేష్ (కోనసీమ), ఎం.భార్గవ్ సుకాంత్ సాకేత్, టీవీఎస్ కావ్యశ్రీ, కె.సీతాసాగర్(తూర్పు గోదావరి), ఎ.నాగశివసాయి దివ్య, టి.నాగు ఉదయ్ అనురాగ్, టి.శ్రీలాస్య (గుంటూరు), ఎస్.ప్రీతమ్ దర్శిన్(ఎన్‌టీఆర్) విజేతలుగా నిలిచారు. అండర్–7 విభాగంలో ఎ.కావ్య, ఎ.ప్రభంజన్, అండర్–9 విభాగంలో వై.సుజిమ్, జె.సవితరెడ్డి, అండర్–11 విభాగంలో ఎం.సుజిత, వై.ప్రేమ్‌రక్షిత, అండర్–13 విభాగంలో వి.హేమంత్‌కుమార్, పి.సుచిత్ర క్రిస్టీ, అండర్–15 విభాగంలో ఎ.జయ ప్రకాష్, కె.సోనాలికార్తీక్ విజేతలుగా నిలిచారు.

పోటెత్తిన భక్తులు



గుబ్బల మంగమ్మ సన్నిధిలో భక్తులు

బుట్టాయగూడెం: మండలంలోని మారుమూల గ్రామం కామవరం సమీపంలోని అటవీ ప్రాంతంలో కొలువైన గుబ్బల మంగమ్మతల్లిని ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మాఘ మాసం ప్రారంభం కావడంతో మండపేటకు చెందిన పూల వ్యాపారి ప్రత్యేక పూలతో అమ్మవారి సన్నిధిని అలంకరించి పూజా కార్యక్రమాలు చేశారు. అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులకు అన్నదానం చేశారు. అలాగే మండలంలోని మర్లగూడెం అటవీ ప్రాంతంలో కొలువైన పాటిమ్మ తల్లి, దుర్గమ్మ తల్లిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

బీసీలు బలంగా ఉండాలి



బీసీ సభలో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి

తాడేపల్లిగూడెం రూరల్: బీసీలు మరింత బలంగా ఉండాలని, గౌరవాన్ని పెంచుకోవాలని పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు అన్నారు. తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లిలో ట్రినిటీ ఆస్పత్రి ఎదురుగా ఉన్న స్థలంలో బీసీ చైతన్యవేదిక బహిరంగ సభ ఆదివారం నిర్వహించారు. సభకు బీసీ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వీరవల్లి శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ బీసీలు పది మందిని అక్కున చేర్చుకోవాలని అన్నారు. టీటీడీ బోర్డు మెంబర్ మేకా శేషుబాబు మాట్లాడుతూ రాజకీయ పార్టీలన్నీ దామాషా ప్రాతిపదికన బీసీలకు అవకాశాలు కల్పించాలని కోరారు. బీసీల హక్కుల పరిరక్షణకు ముందుకు రావాలన్నారు. ఏ ప్రభుత్వం, ఏ రాజకీయ పార్టీ ఏం చేస్తుందనే చైతన్యం బీసీల్లో వచ్చిందన్నారు. గ్రామాల్లోని బీసీలను గౌరవించి ఒకే తాటిపైకి తీసుకువచ్చి వారి మనోభావాలను గౌరవించాలన్నారు. ఉభయగోదావరి జిల్లాల్లోని నరసాపురం, ఏలూరు, రాజమహేంద్రవరం ఎంపీ స్థానాలను వైఎస్సార్‌సీపీ బీసీలకు కేటాయించిందని, బీసీలకు సముచిత స్థానం కల్పించిన వారిని గెలిపించుకోవాలన్నారు. రాష్ట్ర కొప్పు వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ గొర్రెల శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నర్సాపురం ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల, జిల్లా నాయీ బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు గుమ్ములూరి శ్రీహరిరావు, వివిధ సంఘాల నాయకులు బొద్దాని శ్రీనివాస్, అడ్డాల నరసింహారావు, చిటకన ప్రసాద్, ముద్రగడ లలితకుమారి, లక్కోజు సుజాత, జీకే ఆనంద్, కిలాడి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మద్ది సన్నిధిలో లోకాయుక్త రిజిస్ట్రార్



స్వామి వారి సన్నిధిలో ఉన్న లోకాయుక్త రిజిస్ట్రార్ ఉషారాణి

జంగారెడ్డిగూడెం రూరల్: గురవాయిగూడెంలోని శ్రీమద్ది ఆంజనేయస్వామి వారి క్షేత్రాన్ని పలువురు ఉన్నతాధికారులు ఆదివారం దర్శించుకున్నారు. లోకాయుక్త రిజిస్ట్రార్ ఎం.ఉషారాణి, అన్నవరం ఏఈవో, తలుపులమ్మ తల్లి దేవస్థానం డిప్యూటీ కమిషనర్ పెన్మెత్స విశ్వనాథరాజు స్వామివారిని వేర్వేరుగా దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్యేక పూజల అనంతరం ఆలయ మర్యాదలతో వీరికి ఈవో కొండలరావు సత్కరించి స్వామి వారి ప్రసాదాలను అందజేశారు. మాఘ ఆదివారం సందర్భంగా క్షేత్రంలో సూర్య నమస్కారాల ప్రత్యేక పూజా కార్యక్రమాలను వేద పండితులలు ఘనంగా నిర్వహించారు.

వ్యక్తి అరెస్టు.. సారా స్వాధీనం

పాలకోడేరు: విస్సాకోడేరు పంచాయతీ వంకాయలపాలెంలో సారా తయారీ కేంద్రంపై దాడి చేసి ఓ వ్యక్తి అదుపులోకి తీసుకుని రెండు లీటర్ల స్వాధీనం చేసుకున్నామని ఎస్సై నాళం శ్రీనివాసరావు ఆదివారం చెప్పారు. ఈ దాడిలో సారా తయారు చేసేందుకు సిద్ధం చేసిన 50 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. నిందితుడు కడలి పల్లంశెట్టిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



రామ్మూర్తి మృతదేహం

ఉండి: యండగండిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా మరో వ్యక్తి తీవ్ర గాయాలపాలయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం యండగండి వైపు నుంచి భీమవరం వైపు వెళుతున్న కారు ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని వేగంగా ఢీ కొట్టింది. దానిపై ప్రయాణిస్తున్న అత్తిలికి చెందిన చిన్నంపల్లి రామ్మూర్తి (45) అక్కడికక్కడే మృతి చెందాడు. మరో వ్యక్తి ములగల జగదీష్ తీవ్రగాయాలు కావడంతో అతనిని ఆసుపత్రికి తరలించారు. అయితే ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. ప్రమాద సమాచారాన్ని అందుకున్న ఎస్సై ఎం లక్ష్మణ్ ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు.

పంటకు త'రుణ'మిదే

- పంటల సాగుకు రుణ పరిమితి పెంపు
- వరికి ఎకరాకు గరిష్టంగా రూ.50 వేలు
- సకాలంలో చెల్లిస్తే వడ్డీ రాయితీ వర్తింపు
- మార్చి నుంచి రుణాల పంపిణీకి కసరత్తు

రైతు సంక్షేమం కోసం వెన్నుదన్నుగా నిలుస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేసి పంట రుణ పరిమితిని పెంచడమే కాక రైతులకు పంట రుణాలు విరివిగా అందించేందుకు చర్యలు తీసుకుంటోంది. దీనిలో భాగంగా 2024–25 సంవత్సరానికి పంటల వారీగా రుణ పరిమితి (స్కేల్ ఆఫ్ ఫైనాన్స్)ను ఖరారు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మార్చి నుంచి రైతులకు రుణాలు మంజూరు చేయనుండగా, ఎకరాకు గరిష్టంగా రూ.50 వేల వరకు రుణం అందించనుంది.



భీమవరం (ప్రకాశం చౌక్): జిల్లాలోని ఆయా పంటలకు ఖరీఫ్, రబీ పంటలకు ఎంత రుణం మంజూరు చేయాలనేది దానిపై జిల్లా లీడ్ బ్యాంక్ ద్వారా ఆయా బ్యాంకులకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రణాళికను విడుదల చేసింది. వ్యవసాయంపై పెరుగుతున్న పెట్టుబడి వ్యయం, కూలీల ఖర్చు తదితర వాటిని పరిగణనలోకి తీసుకుని ఎకరా సాగుకు అయ్యే ఖర్చును లెక్కలోకి తీసుకున్నారు. రుణ పరిమితి ఎకరాకు ఎంత ఉండాలనేది రాష్ట్రస్థాయి సాంకేతిక కమిటీ నిర్ధారించింది. ఇందుకు అనుగుణంగా బ్యాంకులు ఖరీఫ్, రబీ సీజన్లకు రుణాలు మంజూరు చేయనున్నాయి. ఫిబ్రవరి నుంచి సెప్టెంబర్ వరకు ఖరీఫ్ సీజన్, అక్టోబర్ నుంచి మార్చి వరకు రబీ సీజన్‌గా పరిగణించి రుణాలను బ్యాంకులు మంజూరు చేయనున్నాయి.

వరికి రూ.5 వేల పెంపు

జిల్లాలో 80 శాతం ప్రధాన పంటగా వరి సాగు చేస్తున్నారు. వరికి సంబంధించి పంట రుణం స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం ఎకరాకు రూ.5 వేలకు పెంచారు. 2023–24 ఖరీఫ్‌కు ఎకరాకు రూ.38 వేలు నుంచి రూ.42 వేలు, రబీకి రూ.42 వేలు నుంచి రూ.45 వేలు ఉంటే ఈ ఏడాది 2024–25 సంవత్సరానికి ఎకరాకు రూ.42 వేల నుంచి రూ.46 వేలు, రబీకి ఎకరాకు రూ.46 వేల నుంచి రూ.50 వేల వరకు పంట రుణం ఇవ్వనున్నారు.

కిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా..

అర్హులైన రైతులందరికీ కిసాన్ క్రెడిట్ కార్డులు మంజూరు చేసి ఎటువంటి హామీ లేకుండా రూ.1.60 లక్షల వరకు బ్యాంకులు రుణాలు అందించేలా లీడ్ బ్యాంక్ చర్యలు తీసుకుంటోంది. రుణం సకాలంలో చెల్లిస్తే రైతులకు వడ్డీ రాయితీని కూడా ప్రభుత్వం అందించనుంది. కౌలు రైతుల రుణార్హత కార్డులు, రైతు మిత్ర గ్రూపులకు రుణాలు మంజూరు చేయనుంది.

అధిక వడ్డీల నుంచి విముక్తి

పెట్టుబడి కోసం వ్యాపారుల వద్ద అధిక వడ్డీలకు రుణాలు తెచ్చి పంటల సాగు చేసి తిరిగి చెల్లించే ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం ముందుగానే బ్యాంకుల ద్వారా తక్కువ వడ్డీకే రుణాలు సకాలంలో రైతులకు అందించేలా చర్యలు తీసుకోనుంది. సకాలంలో రుణాలు చెల్లిస్తే వడ్డీ రాయితీతో పాటు పంటల బీమా సౌకర్యాన్ని కూడా కల్పించనుంది.

పంటలకు పెరిగిన రుణ పరిమితి వివరాలు (ఎకరాకు)

పంట	ఖరీఫ్	రబీ
వరి	రూ.42 వేల నుంచి రూ.46 వేలు	రూ.46 వేల నుంచి రూ.50 వేలు
అరటి	రూ.80 వేల నుంచి రూ.85 వేలు	రూ.80 వేలు నుంచి రూ.85 వేలు
బొప్పాయి	రూ.80 వేల నుంచి రూ.90 వేలు	
మామిడి	రూ.45 వేల నుంచి రూ.50 వేలు	
నిమ్మ	రూ.65 వేల నుంచి రూ.70 వేలు	
పోగాకు	రూ.36 వేల నుంచి రూ.40 వేలు	
మొక్కజొన్న	రూ.40 వేల నుంచి రూ.44 వేలు	రూ.40 వేల నుంచి రూ.44 వేలు
మినప	రూ.23 వేలు నుంచి రూ.26 వేలు	రూ.23 వేల నుంచి రూ.26 వేలు
జామి	రూ.40 వేలు నుంచి రూ.45 వేలు	రూ.50 వేల నుంచి రూ.60 వేలు
చెరకు	రూ.80 వేలు నుంచి రూ.82 వేలు	రూ.80 వేల నుంచి రూ.82 వేలు

సకాలంలో రుణాలిస్తాం



కలెక్టర్ అదేశాల మేరకు జిల్లాలోని రైతులకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం బ్యాంకులు రుణాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. అర్హులైన రైతులందరికీ పంట రుణాలు సకాలంలో అందించేలా ఆయా బ్యాంకులతో సమన్వయం చేస్తున్నాం. కిసాన్ క్రెడిట్ కార్డు ఉంటే ఎలాంటి హామీ లేకుండా రూ.1.60 లక్షల రుణం బ్యాంకులు ఇస్తాయి. రుణాలను రైతులు సకాలంలో చెల్లిస్తే వడ్డీ రాయితీ వర్తిస్తుంది. క్షేత్రస్థాయిలో రైతులకు బ్యాంకు రుణాలపై అవగాహన కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నాం.

– ఎ.నాగేంద్రప్రసాద్, లీడ్ బ్యాంకు మేనేజర్, పశ్చిమగోదావరి జిల్లా

భీమవరంలో ఆధునిక గుండె వైద్యం



హాస్పిటల్‌ను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్యనారాయణమూర్తి (బాబ్జి)

భీమవరం (ప్రకాశం చౌక్): భీమవరంలో పూర్తిస్థాయి గుండె వైద్య సేవలు అందించడానికి ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్, భీమవరం హాస్పిటల్స్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన గుండె వైద్య విభాగాన్ని ఆదివారం భీమవరం హాస్పిటల్స్ ప్రాంగణంలో ప్రముఖ వైద్యుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్యనారాయణ మూర్తి (బాబ్జి) ప్రారంభించారు. డాక్టర్ బాబ్జీ మాట్లాడుతూ గుండె వైద్యంలో ఎంతో పేరుగాంచిన రమేష్ హాస్పిటల్స్ ఈ ప్రాంత ప్రజలకు వైద్య సేవలందించడానికి భీమవరం హాస్పిటల్స్‌తో కలిసి ముందుకురావడంపై కృతజ్ఞతలు తెలిపారు. రమేష్ హాస్పిటల్స్ ఎండీ డాక్టర్ పోతినేని రమేష్‌బాబు మాట్లాడుతూ గుండె జబ్బులున్నవారికి అత్యవసర వైద్యం అందాలని, ఇప్పుడు భీమవరం హాస్పిటల్స్‌లో ఈ సేవలను అత్యున్నత ప్రమాణాలతో అందుబాటులోకి తెస్తున్నామని చెప్పారు. భీమవరం హాస్పిటల్స్ ఎండీ డాక్టర్ కృష్ణంరాజు మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజలకు గుండె వైద్యసేవలు 24 గంటలు అందిస్తామన్నారు. భీమవరం హాస్పిటల్స్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ డాక్టర్ గోపాలరాజు, కార్డియాలజిస్టులు డాక్టర్ మహేష్, డాక్టర్ జీవీ సత్యనారాయణరాజు, రమేష్ హాస్పిటల్స్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ పావులూరి శ్రీనివాసరావు, డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రాయపాటి మమత, బిజినెస్ డెవలప్‌మెంట్ హెడ్ డాక్టర్ కార్తీక్ చౌదరి పాల్గొన్నారు.

మార్మోగిన వాసవీ నామస్మరణ

- 102 కలశాలతో వెండిపల్లకీపై అమ్మవారికి గ్రామోత్సవం
- పెనుగొండలో భక్తిశ్రద్ధలతో ఆత్మార్పణ దినోత్సవం



పెనుగొండలో వాసవీ మాత గ్రామోత్సవంలో భారీ సంఖ్యలో పాల్గొన్న భక్తులు

పెనుగొండ: జై వాసవీ.. జైజై వాసవీ.. ఓం నమో: వాసవాంబయ నమః నామస్మరణతో పెనుగొండ క్షేత్రం మారుమోగింది, ఆర్యవైశ్యుల ఆరాధ్య దేవత వాసవీ కన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవాన్ని మూలవిరాట్ శ్రీనగరేశ్వర మహిషాసురమర్దనీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తమిళనాడు, కర్ణాటక, తెలంగాణతో పాటు రాష్ట్రంలోని నలుమూలల నుంచి వచ్చిన వాసవీ భక్తులు, వాసవీ మాలధారులతో పెనుగొండ కిటకిటలాడింది. వాసవీ యువజన సంఘం, వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో బజారు రామాలయం నుంచి వందలాది మంది వాసవీ దీక్ష మాలధారులు, వాసవీ భక్తులు 102 కలశాలతో చిన్నారులు వెండిపల్లకీపై వాసవీ మాతకు భారీ గ్రామోత్సవం నిర్వహించారు. వాసవీ ఆలయం వరకు జరిగిన ఈ గ్రామోత్సవానికి భక్తులు పసుపు నీళ్లు జిమ్ముతూ, మంగళ హారతులు పాడుతూ స్వాగతం పలికారు. యువజన సంఘం ఆధ్వర్యంలో వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు.

వాసవీ దీక్షల విరమణ

శ్రీనగరేశ్వర స్వామికి, మహిషాసురమర్దని, వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవార్లకు అభిషేకాలు కనుల పండుగగా నిర్వహించారు. తమిళనాడు, కర్ణాటక, ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చిన సుమారు వందలాది మంది దీక్షధారులు ఆలయ ప్రాంగణంలో వాసవీ హోమం నిర్వహించి దీక్షను విరమించారు. ఆలయంలో వేద పండితులు రామడుగుల నరసింహమూర్తి 102 హోమక్రతవులు నిర్వహించి దీక్షాధారులతో పూర్ణాహుతి సమర్పింప చేసి దీక్షను విరమింప చేశారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులకు ఆలయంలోని నిత్యాన్నదానంలోనూ, ఆలయం వెలుపల వాసవీ యువజన సంఘం ఆధ్వర్యంలో భారీ అన్నప్రసాదం పంపిణీ చేశారు.

వాసవీ శాంతి థాంలో..

వాసవీ శాంతిథాంలో పెనుగొండ క్షేత్ర పిఠాధిపతి కృష్ణానందపురి స్వామిజీ పర్యవేక్షణలో వాసవీ ఆత్మార్పణ దినోత్సవం వైభవంగా నిర్వహించారు. ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ పీఎన్ గోవిందరాజు, ఉమా గోవిందరాజు దంపతులు గోపూజ చేసిన అనంతరం 102 రుషీ గోత్రమందిరంలో 90 అడుగుల పంచలోహ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన మరకత శిల వాసవీ మాతకు డాక్టర్ పీఎన్ గోవిందరాజు అభిషేకాలు నిర్వహించారు. వాసవీ మాతకు కేరళ రాష్ట్రం త్రిశూర్ జిల్లా కలెక్టర్ తేజ ప్రత్యేక పూజలు చేశారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన పీఠాధిపతులు వాసవీ మాతకు నీరాజనం పలికారు. మువ్వ గోపాల స్వామి కల్చరల్ అకాడమీ విజయవాడ వారి ఆధ్వర్యంలో భరత నాట్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో కోట్ల వెంకటేశ్వరరావు, కోట్ల సూర్యారావు పాల్గొన్నారు.



వాసవీ మాతకు వెండి పల్లకీపై గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



పెనుగొండలో వాసవీ మాతకు పూజలు నిర్వహిస్తున్న కేరళ త్రిశూర్ జిల్లా కలెక్టరు తేజ

ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య



ముత్యాల పవన్ కుమార్ (ఫైల్)

తాడేపల్లిగూడెం అర్బన్: అప్పుల బాధ తాళలేక ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బంధువులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని సిపాయిపేటలో నివాసం ఉంటున్న ముత్యాల పవన్‌కుమార్ (27) ఫైనాన్స్‌పై కారును తీసుకున్నాడు. ఇటీవల కొన్ని వాయిదాలు చెల్లించలేకపోయాడు. వాయిదాలు చెల్లించాలని ఫైనాన్స్ సంస్థ సిబ్బంది ఒత్తిడి చేయడంతో మనస్తాపానికి గురయ్యాడు. శనివారం రాత్రి యధావిధిగా రాత్రి నిద్రపోయాడు. ఆదివారం ఉదయం పవన్‌కుమార్ లేవకపోవడంతో కుటుంబ సభ్యులకు అనుమానం వచ్చి అతని గదిలోకి వెళ్లి చూడగా ఫ్యాన్‌కు ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించాడు. దీంతో కుటుంబ సభ్యులు కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పట్టణ ఎస్సై సుధాకరరెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అర్జావారిగూడెంలో..



మృతి చెందిన కూరపాటి నిర్మలరాజు

భీమడోలు: భీమడోలు పంచాయతీ శివారు ఆర్జావారిగూడెంకు చెందిన ఓ యువకుడు ఆదివారం రాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కూరపాటి నిర్మలరాజు (23) మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో యువకుడ్ని తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్తాపానికి గురై క్షణికావేశంలో ఇంట్లోని దూలానికి ఉరి వేసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించాడు. వెంటనే అతన్ని భీమడోలులోని ప్రభుత్వ ఆసుపత్రికి తల్లిదండ్రులు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆసుపత్రి నుంచి అందిన సమాచారం మేరకు భీమడోలు పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు భీమడోలు ఎస్సై వై.సుధాకర్ చెప్పారు.

పురుగుమందు తాగి వృద్ధుడి ఆత్మహత్య

ఉండి: అనారోగ్యాన్ని భరించలేక ఓ వృద్ధుడు పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మండలంలోని వాండ్రం గ్రామానికి చెందిన బోను సూర్యనారాయణ(75) కీళ్లనొప్పులు, అరికాళ్ల మంటలతో కొంతకాలంగా బాధపడుతున్నాడు. వాటిని భరించలేక శనివారం రాత్రి మద్యంలో పురుగుల మందు కలుపుకుని తాగాడు. ఆదివారం ఉదయం అతని నోటి నుంచి నురగ రావడం గమనించిన కుటుంబ సభ్యులు అతనిని వెంటనే భీమవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కొద్దిసేపటికే మృతి చెందాడు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు. మృతుని పెద్దకుమార్తె నాగలక్ష్మి ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ వేణు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతానికి వలంటీర్ మృతి



వలంటీర్ నరసింహారావు (ఫైల్)

ద్వారకాతిరుమల : రామసింగవరంలో విద్యుదాఘాతానికి గురై ఒక వలంటీర్ శనివారం రాత్రి మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం... గ్రామానికి చెందిన అవివాహితుడైన ఓగిరాల నరసింహారావు (డేవిడ్) (35) వలంటీర్‌గా పనిచేస్తున్నాడు. రాత్రి 10 గంటల సమయంలో ఇంట్లో ఫ్యాన్ తిరగడం లేదని ప్లగ్‌ను స్విచ్ బోర్డులో పెట్టే క్రమంలో విద్యుత్ షాక్‌కు గురై కుప్పకూలి పడిపోయాడు. వెంటనే అతని తల్లిదండ్రులు నాగేశ్వరరావు, పాప స్థానికుల సహాయంతో ఆస్పత్రికి తరలించేందుకు ప్రయత్నించారు. అయితే అప్పటికే అతడు మృతి చెందినట్టు వారు నిర్ధారించుకున్నారు. ద్వారకాతిరుమల పోలీసులకు సమాచారం అందించడంతో వారు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో పడి ఇద్దరు బాలుర దుర్మరణం



సరిపల్లిలో సందేశ్, చందు మృతదేహాల వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

కొయ్యలగూడెం: తాత ఇంట్లో పుట్టిన రోజు వేడుకకు వచ్చిన ఇద్దరు బాలురు బహిర్భూమికోసం వెళ్లి చెరువులో పడి దుర్మరణం చెందారు. వివరాలిలా ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లా గోపాలపురంలో నివాసం ఉంటున్న కొత్రా గగన్ సందేశ్ (16), అద్దేపల్లి చందు (12) బంధువులు. ఈ నెల 10వ తేదీన కుటుంబ సభ్యులతో కలిసి కొయ్యలగూడెం మండలం సరిపల్లిలో ఉంటున్న తమ తాత ఇజ్రాయిల్ ఇంట్లో జరిగిన పుట్టిన రోజు వేడుకకు హాజరయ్యారు. ఆదివారం ఉదయం సందేశ్, చందు బహిర్భూమికి వెళుతున్నామని ఇంట్లో చెప్పి బైక్‌పై వెళ్లారు. సాయంత్రం అయినా వీరు ఇంటికి చేరుకోకపోయేసరికి గ్రామస్తులతో కలిసి కుటుంబ సభ్యులు వారి కోసం వెతుకుతుండగా, సందేశ్, చందు వేసుకుని వెళ్లి బైక్ సరిపల్లి సమీపంలో ధర్మారావుపేట రోడ్డులో ఉన్న కోమటిగుంట చెరువు వద్ద గుర్తించారు. దీంతో చెరువు వద్ద వెతకగా, మునిగిపోయిన బాలల చేతులు చెరువులో పైకి ఎత్తి ఉండటాన్ని గమనించారు. వెంటనే ఇద్దరిని బయటకు తీయగా, అప్పటికే వారు ప్రాణాలు కోల్పోయారు. తాత ఇంట్లో పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొనేందుకు వచ్చి మృత్యువు ఒడికి చేరడంతో బంధువులు కన్నీరుమున్నీరయ్యారు. సందేశ్, చందు మృతదేహాల వద్ద తల్లిదండ్రులు గుండెలవిసేలా విలపించారు. వేడుకలు జరుపుకున్న ఇంట విషాదం నెలకొందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. సందేశ్ తండ్రి లాజర్, మేరీలకు ముగ్గురు కుమార్తెలు కాగా ఒక్కడే కుమారుడు. అదేవిధంగా చందు తండ్రి రాజేంద్ర, తల్లి లలితకు ఒక కుమార్తె కాగా, ఒక్కడే కొడుకు. రెండు కుటుంబాల వారు వేడుకలకు వచ్చి దుర్ఘటనపాలు అయ్యారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. బాలుర మృతిపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. కొయ్యలగూడెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పొత్తుల్లో నితీష్‌ను మించిన చంద్రబాబు



భీమవరంలో మాట్లాడుతున్న మంగరాజు

భీమవరం: పొత్తులు పెట్టుకోవడంలో టీడీపీ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు బిహార్ సీఎం నితీష్‌కుమార్‌ను మించిపోయారని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు, ఎస్సీ, ఎస్టీ, విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యుడు చీకటిమిల్లి మంగరాజు విమర్శించారు. ఆదివారం భీమవరంలో విలేకర్లతో మాట్లాడుతూ అపవిత్ర రాజకీయాల్లో చంద్రబాబు రికార్డును ఎవరు బద్దలు కొట్టలేరన్నారు. తన పార్టీ కార్యకర్తలతో కేంద్రమంత్రి అమిత్‌షాపై రాళ్లు వేయించిన చంద్రబాబు సిగ్గు లేకుండా పొత్తు కోసం ఢిల్లీ వెళ్లి అమిత్‌షా కాళ్లు పట్టుకోవడం టీడీపీ దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అసెంబ్లీ, పార్లమెంట్ సీట్లు విషయంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ప్రజా, సంక్షేమ కార్యక్రమాలతో అన్నివర్గాల ఆదరణ పొందుతున్న జగన్ రానున్న ఎన్నికల్లో 175 సీట్లు గెలుచుకోవడం కష్టం కాదని మంగరాజు స్పష్టం చేశారు. విలేకరుల సమావేశంలో మాలమహానాడు నాయకులు పొన్నమండ బాలకృష్ణ, భారత్, సునీల్ బాబు, బి.రోహిత్ పాల్గొన్నారు.

సొసైటీలో అవినీతి వాస్తవం కాదు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం సొసైటీలో నిధులు దుర్వినియోగంపై వచ్చిన ఆరోపణలు వాస్తవం కాదని సొసైటీ సీఈఓ డి.రత్నాజీ చెప్పారు. ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. సొసైటీకి, బ్యాంకుకు ఆర్థికంగా ఎటువంటి నష్టం సంభవించలేదన్నారు. ఉన్నతాధికారుల విచారణలో ఏ ఒక్క రైతు కూడా ఫిర్యాదులు చేయలేదన్నారు. అంతేకాక రూ.2.75 కోట్లు ఆస్తిని తనఖా పెట్టి తాను సొసైటీ నుంచి తన భార్య పేరున రూ.35 లక్షల రుణం తీసుకున్నానన్నారు. గత ఏప్రిల్ నుంచి జూన్ వరకు రెన్యువల్ చేయాల్సిన రూ.7 కోట్ల రుణాలకు సంబంధించి బ్యాంకు గౌరవం కాపాడేందుకు రూ.49 లక్షలు రైతుల నుంచి వడ్డీ వసూలు చేయాల్సి ఉండగా రైతులు చెల్లించనప్పటికీ వారే చెల్లించినట్లు నమోదు చేయడంతో నగదు నిల్వలు పెరిగాయన్నారు. కేవలం రైతులను అధిక వడ్డీ బారిన నుండి కాపాడేందుకు అలా చేయాల్సి వచ్చిందని వివరించారు. దీని వల్ల రైతులకు రూ. 21 లక్షల వడ్డీ రాయితీ వస్తుందన్నారు. పని ఒత్తిడిలో కంప్యూటర్ ఆపరేటర్ డబుల్ ఎంట్రీ చేయడంతో రూ.12.13 లక్షల నగదు నిల్వ పెరిగిందన్నారు. నగదు నిల్వ తగ్గించేందుకు సీఈఓ తన కుటుంబ సభ్యుల పేరిట సొంత సొమ్ము అప్పుగా తీసుకువచ్చి చిట్టాల్లో నమోదు చేశామన్నారు.

క్లుప్తంగా

అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ


వాసవి ఆలయంలో ఏర్పాటు చేసిన అభయాంజనేయ స్వామి విగ్రహం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి పంచాయతన క్షేత్రంలో 21 అడుగుల అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ ఆదివారం ఉదయం వైభవంగా జరిగింది. ఆర్యవైశ్య సంఘం గౌరవాధ్యక్షుడు మారం వెంకటేశ్వరరావు ఆధ్వర్యాన శ్రీ వాసవి ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు జరిగాయి. భారీ అన్నసమారాధనలో భక్తులు ప్రసాదం స్వీకరించారు. ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షుడు కొర్లేపర రాము, కార్యదర్శి నున్న సుందరం, కోశాధికారి భోగవల్లి రమేష్, వబిలిశెట్టి నటరాజు, మండా బ్రహ్మాజీ, కోనా శ్రీనివాసరావు, నున్న ఆనంద్, గ్రంధి సత్యనారాయణ తదితరులు పర్యవేక్షించారు.

కరాటే పోటీల్లో విద్యార్థులకు పతకాలు


పతకాలు సాధించిన విద్యార్థులు

తాడేపల్లిగూడెం: కోనసీమ అంబేద్కర్ జిల్లా అమలాపురంలో ఆదివారం జరిగిన ఏపీ స్టేట్ ఇన్విటేషనల్ కరాటే చాంపియన్‌షిప్ 2024 పోటీల్లో తాడేపల్లిగూడెం పట్టణానికి చెందిన సీకో షాటోఖాన్ అడ్వాన్స్‌డ్ కరాటే డో సంస్థకు చెందిన విద్యార్థులు పతకాలు సాధించినట్టు చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ ఎ.శ్యాం బాలాజీ తెలిపారు. కటాలో వివిధ విభాగాల్లో ఎస్.పునీత్, ఎస్‌కే నసిర, ఎన్‌వీఎస్ హవిష్‌రెడ్డి, ఎస్.తేజస్విని స్వర్ణ పతకాలు, సీహెచ్ హర్షిత, ఎం.వరుణిక కాంస్య పతకాలు పొందారు. కుమితి విభాగంలో ఎస్.పునీత్, ఎస్‌కే నసిర, హర్షిత బంగారు పతకాలు సాధించారు.

అత్తిలిలో లయన్స్ క్లబ్ సోషల్ జోన్ కార్యక్రమం


క్లబ్ ప్రతినిధులను సత్కరిస్తున్న దృశ్యం

అత్తిలి: లయన్స్ క్లబ్ ఆధ్వర్యాన కార్తికేయ జోన్ సోషల్ కార్యక్రమం జోన్ చైర్మన్ యాతం రాంబాబు, సుజాత పర్యవేక్షణలో ఆదివారం నిర్వహించారు. లయన్స్ క్లబ్ ద్వారా సేవలు అందించిన వారిని గుర్తించి వారికి జ్ఞాపికలు అందచేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు శింగులూరి చంద్రశేఖర్, మాజీ అధ్యక్షుడు పట్నాల వెంకటేశ్వరరావు, దొండమూరి వెంకటేశ్వరరావు, మద్దాల వెంకటేశ్వరరావు, సుబ్బరాజు, సన్నిధి సూర్యనారాయణగుప్త, సంకు బాబూరావు, పంజా ప్రసాద్, శీతాల శ్రీనివాస్, వడ్డి కొండబాబు, పైడిపర్రు, తేతలి, తణుకు మైత్రి, వేలివెన్ను, తణుకు ఉజ్వల, రేలంగి, అత్తిలి క్లబ్‌ల ప్రతినిధులు పాల్గొన్నారు.

గ్రామీణ భారత్ సమ్మెను విజయవంతం చేయండి

వీరవాసరం: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కేంద్ర కార్మిక సంఘాలు, కిసాన్ మోర్చా ఇచ్చిన పిలుపులో భాగంగా ఈనెల 16న తలపెట్టిన గ్రామీణ భారత్ సమ్మెను విజయవంతం చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జుత్తిగ నరసింహమూర్తి, ఆకుల హరేరామ్ కోరారు. ఆదివారం వీరవాసరంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో మండలంలోని అన్ని గ్రామాల్లో సమ్మె విజయవంతం కోరుతూ ప్రచారం చేయాలని తీర్మానించారు. కేంద్ర ప్రభుత్వం ప్రజలపై పన్నుల రూపంలో దాడి చేస్తోందన్నారు. ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చడం కోసం నిధులు కేటాయించడం, ప్రణాళికలు రూపొందించడం ద్వారా మాత్రమే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. గత పదేళ్లలో విశాఖ ఉక్కు వంటి పరిశ్రమను నిర్మించడానికి కేంద్ర ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. సమావేశంలో కె.సత్తిబాబు, నాగరత్నం, వరలక్ష్మి, నిర్మల, ఎం.ఆంజనేయులు పాల్గొన్నారు.

బాల సుబ్రహ్మణ్యుని సన్నిధిలో పీవీఎల్

ఉండి: ఎన్నార్పీ అగ్రహారం బీసీ కాలనీలో వేంచేసి యున్న బాల సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ పునఃప్రతిష్ఠను పురస్కరించుకుని ఆదివారం డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు ప్రత్యేక పూజలు చేశారు. తొలుత కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు ఆయనకు సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పీవీఎల్ మాట్లాడుతూ రాష్ట్రంలో కులమతాలు, రాజకీయాలకు అతీతంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో రాబోయే రోజుల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో మరింత సంక్షేమంతో జీవించాలని దేవుడ్ని ప్రార్థించినట్లు చెప్పారు. మాజీ సర్పంచ్ ముసుకోలు సింహాచలం పాల్గొన్నారు.

పేదలు.. ఇక పట్టాదారులు

- చురుగ్గా జగనన్న ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ
- తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో 31 వేల మంది లబ్ధిదారులకు ప్రయోజనం


జగనన్న కాలనీలోని ఇళ్లు

పెంటపాడు: నవరత్నాలు – పేదలందరికీ ఇళ్ల పథకంలో భాగంగా జగనన్న ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ చురుగ్గా సాగుతోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం లబ్ధిదారుల్లో సంతోషాన్ని నింపుతోంది. తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో దాదాపు 31 వేలపైగా ఇళ్ల స్థలాలను పేదలకు పంపిణీ చేశారు. వాస్తవానికి గూడెం పట్టణంలో దాదాపు 750 ఎకరాల స్థలాన్ని సేకరించి పలు లేఅవుట్లలో లబ్ధిదారులను ఇళ్లను కేటాయించారు. స్థలాల కొనుగోలు, చదును ప్రక్రియ, మౌలిక సదుపాయాల కల్పనతో కలిపి సుమారు రూ.750 కోట్ల విలువైన ఇంటి స్థలాలను ఇప్పటికే పేదలకు పంపిణీ చేశారు. ఇంత విలువైన స్థలాలకు గతంలో ఉండే నిబంధనల ప్రకారం కేవలం అనుభవించే హక్కు మాత్రమే ఉండేది. ఇప్పుడు పూర్తిస్థాయిలో లబ్ధిదారులకు బదలాయించి రిజిస్ట్రేషన్లు చేయడం వల్ల ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా కొన్నేళ్ల తరువాత ఆ స్థలంపై పూర్తి హక్కు లభిస్తుంది.

వీఆర్వోలతో రిజిస్ట్రేషన్

రిజిస్ట్రేషన్ల ప్రక్రియను ఆయా గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో వీఆర్వోలే ప్రభుత్వం తరఫున పూర్తి చేసి లబ్ధిదారులకు పత్రాలు అందజేయనున్నారు.

పేదల పక్షాన ప్రభుత్వం

ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల స్థలాలకు రిజిస్ట్రేషన్లు చేయాలన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయంతో లక్షలాది మంది ప్రజలకు ప్రయోజనం చేకూరనున్నది. భవిష్యత్తులో కుటుంబ అవసరాల కోసం సదురు స్థలాన్ని తాకట్టు పెట్టాలన్నా, వారసులకు బదలాయించుకోవాలన్నా, వేరొకరికి బదిలీ చేయించే హక్కు కూడా ఈ రిజిస్ట్రేషన్ వల్ల కలుగుతుంది.

సద్వినియోగం చేసుకోవాలి



నవరత్నాలు – పేదలందరికీ ఇళ్ల పథకంలో ఇచ్చిన స్థలాలను రిజిస్ట్రేషన్ చేస్తున్నాం. ఇందుకు సంబంధించి సచివాలయాల ద్వారా వీఆర్వోలకు ఆదేశాలు ఇప్పటికే ఇచ్చాం. ఆయా సచివాలయాల పరిధిలోని లబ్ధిదారులు ఈ అవకాశాన్ని తప్పక వినియోగించుకోవాలి.

– సురేష్‌బాబు, తహసీల్దార్, పెంటపాడు

కల్యాణం.. కమనీయం


కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు

తాడేపల్లిగూడెం అర్బన్: దేవాదాయ శాఖ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యాన చేపట్టిన ధర్మ ప్రచార మహోత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీ బలుసులమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వేదికపై ఉదయం 10 గంటలకు విశాఖపట్టణంలో వేంచేసి యున్న శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారికి క్షీరాభిషేకం, కుంకుమార్చనలు నిర్వహించారు. మహిళలు విశేషంగా హాజరై సామూహిక కుంకుమ పూజలు చేశారు. అనంతరం అమ్మవారి తీర్థప్రసాదాలను భక్తులకు అందజేశారు.


శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారికి కుంకుమ పూజ నిర్వహిస్తున్న అర్చకులు

వైభవంగా శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామివార్ల కల్యాణం

ఉదయం శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించిన వేదికపైనే సాయంత్రం సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామివార్ల కల్యాణం నిర్వహించారు. స్వామివారి దివ్య కల్యాణ మహోత్సవాన్ని తాడేపల్లిగూడెం పట్టణ, పరిసర ప్రాంతాల ప్రజలు విశేషంగా హాజరై తిలకించారు. కల్యాణం అనంతరం తీర్థప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు. కార్యక్రమాలను ఆయా దేవస్థానాల అధికారులు, సిబ్బందితో పాటు శ్రీ బలుసులమ్మ అమ్మవారి దేవస్థానం ఈవో రవిశంకర్, వైఎస్సార్ సీపీ యువనేత కొట్టు విశాల్, కర్రి భాస్కరరావు, ఆలయ చైర్మన్ కొట్టు అంజిబాబు, గార్లపాటి వీరబాబు, వట్టిప్రోలు రాము, అప్పన రమేష్ కుమార్, ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు.


సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి వార్ల కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు

పూర్వ విద్యార్థుల సేవలు అభినందనీయం


సొసైటీలోని చిన్నారులతో డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పెంటపాడులోని డీఆర్ గోయెంకా డిగ్రీ కళాశాల 1986–89 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. పూర్వ విద్యార్థులు ఆదివారం ఉంగుటూరు గ్రామానికి వెళ్లి గ్రామంలోని అనురాధ రూరల్ ఎడ్యుకేషనల్ సొసైటీలోని పిల్లలకు అన్నదానం, విద్యాసామగ్రి కిట్‌లు అందజేశారు. ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు ఇచ్చారు. పూర్వ విద్యార్థులు తాడేపల్లిగూడేనికి చెందిన ఎల్ఐసీ ఏజెంట్ నున్న వీర వెంకట సాయి సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ 6వ వార్డు మాజీ కౌన్సిలర్ పైబోయిన వైదేహి, అందె చంద్రశేఖర్, సొసైటీ మేనేజర్ విజయ, వింగ్స్ ఆఫ్ ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూళ్లను సద్వినియోగం చేసుకోండి


విద్యార్థుల పఠనాసక్తిని పరిశీలిస్తున్న అపోస్ జిల్లా ఇన్‌చార్జి ఎన్.సత్యనారాయణ

ఆకివీడు: చదువు మధ్యలో ఆపేసిన వారికి ప్రభుత్వం మరో అవకాశం కల్పిస్తూ ఏర్పాటు చేసిన ఓపెన్ స్కూళ్లను సద్వినియోగం చేసుకోవాలని అపోస్ జిల్లా ఇన్‌చార్జి ఎన్.సత్యనారాయణ సూచించారు. స్థానిక విద్యా వికాస్ ప్రైవేట్ స్కూల్‌లో ఓపెన్ స్కూల్ తరగతులను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చదువు మధ్యలో ఆపేసిన విద్యార్థులు, చిరు వ్యాపారాలు, వాహనాలు నడుపుతూ జీవనం గడుపుతున్న వ్యక్తులు పదో తరగతి, ఇంటర్, డిగ్రీ చదివి సర్టిఫికెట్ల ద్వారా ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చన్నారు. ఓపెన్ స్కూల్‌లో చదివేందుకు ఈ ఏడాది విద్యార్థులు అధిక సంఖ్యలో ఆసక్తి చూపి దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. విద్యార్థులు ప్రతి ఆదివారం తరగతులకు హాజరై విద్యను అభ్యసించి, పఠనాసక్తిని పెంచుకుని పరీక్షల్లో ఉత్తీర్ణులు కావాలని ఆయన సూచించారు.

'అనూహ్యం' నాటిక విజయవంతంగా ప్రదర్శించాలి


అనూహ్య నాటిక ప్రతులను నటీనట సంక్షేమ సమాఖ్య సభ్యులకు అందజేస్తున్న ఆలయ చైర్మన్

పాలకొల్లు అర్బన్: నటీనట సంక్షేమ సమాఖ్య ఆధ్వర్యంలో ప్రముఖ నాటిక రచయిత, నటుడు, ఉపాధ్యాయుడు తాళాబత్తుల వెంకటేశ్వరరావు రచించిన »అనూహ్య । సాంఘిక నాటిక రాష్ట్రంలోని అన్ని పరిషత్తులలో విజయవంతంగా ప్రదర్శించాలని శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయ చైర్మన్ కోరాడ శ్రీనివాసరావు కోరారు. ఆదివారం నాటిక ప్రతులను శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో పూజ చేయించి నాటిక ప్రతులను నటీనట సంక్షేమ సమాఖ్య సభ్యులకు అందజేసి అభినందించారు. ఉస్మానియా యూనివర్సిటీ థియేటర్ ఆఫ్ ఆర్ట్స్ రిటైర్డ్ ప్రొఫెసర్ జీఎస్ ప్రసాదరెడ్డి అనూహ్య నాటికను విశ్లేషిస్తూ మానవ సంబంధాల విలువలను తెలిపే ఉత్తమ సందేశాత్మక నాటికగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రచయిత తాళాబత్తుల వెంకటేశ్వరరావు, నాటిక నిర్వాహకుడు గుడాల హరిబాబు, గంటా ముత్యాల నాయుడు, పుత్సల నాగలింగేశ్వరరావు, మాదిరెడ్డి శ్రీనివాస్, శివాల రామారావు తదితరులు పాల్గొన్నారు.

తణుకు మైత్రి క్లబ్‌కు నాలుగు అవార్డులు

తణుకు టౌన్: లయన్స్ సేవలకు సంబంధించి 2023–24 సంవత్సరానికి గానూ తణుకు మైత్రి లయన్స్ క్లబ్ నాలుగు అవార్డులను పొందినట్లు క్లబ్ అధ్యక్షుడు గమిని గోపాల కృష్ణమూర్తి తెలిపారు. ఆదివారం అత్తిలిలో జరిగిన లయన్స్ జోన్ సోషల్ కార్యక్రమంలో జోన్ చైర్మన్ యాతం రాంబాబు అవార్డులను అందజేసినట్లు చెప్పారు. జోన్‌లో ఉత్తమ క్లబ్ అధ్యక్షునిగా గమిని గోపాల కృష్ణమూర్తి, ఉత్తమ కార్యదర్శిగా అక్కాపంతుల బాలాజీ, ఉత్తమ కోశాధికారిగా ఐ.నాగ కృష్ణంరాజు, జోన్‌లో వ్యక్తిగత లయన్ ఆఫ్ జోన్ అవార్డును ఎస్వీ సతీష్ బాబు పొందినట్లు తెలిపారు.

15కు మారిన ఇండోర్ స్టేడియం ప్రారంభోత్సవం

తాడేపల్లిగూడెం (టీఓసీ): తాడేపల్లిగూడెం పురపాలక సంఘం ఆధ్వర్యాన శ్రీశ్రీ డెంటల్ వైద్యశాల సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన డాక్టర్ పీఎల్‌వీ ప్రసాద్ మున్సిపల్ స్పోర్ట్స్ అరీనా ఇండోర్ స్టేడియం ప్రారంభోత్సవం ఈనెల 15వ తేదీ గురువారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ అనపర్తి శామ్యూల్ వెల్లడించారు. అనివార్య కారణాల వల్ల 12వ తేదీ సోమవారం జరగాల్సిన కార్యక్రమం వాయిదా పడినట్లు తెలిపారు. ప్రారంభోత్సవానికి డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ, ప్రత్యేకాధికారి సీహెచ్ చెన్నయ్య, డాక్టర్ పి.శోభారాణి, డాక్టర్ జి.శ్రీనివాస్, డాక్టర్ పి.వి జయవర్మ, ఓపీ గోయంక, నంద్యాల కృష్ణమూర్తి, జీఆర్ రెడ్డి, డాక్టర్ కొండ్రెడ్డి శశికుమార్, పట్టణ ప్రముఖులు హాజరవుతారని చెప్పారు.

14న వీరంపాలెంలో సామూహిక అక్షరాభ్యాసాలు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని వీరంపాలెం శ్రీ బాల త్రిపుర సుందరీ విద్యా, ఆధ్యాత్మిక పీఠం ఆవరణలో ఈనెల 14న వసంత పంచమి సందర్భంగా సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించనున్నట్టు పీఠం వ్యవస్థాపకుడు గరిమెళ్ళ వెంకటరమణ శాస్త్రి తెలిపారు. ఏడాదికోసారి వచ్చే వసంత పంచమి నాడు పిల్లలతో అక్షరాభ్యాసాలు చేయిస్తే సరస్వతి దేవి అనుగ్రహంతో ఉన్నత విద్యావంతులు కాగలరని ఆయన చెప్పారు.

వృద్ధులకు వైద్య పరీక్షలు

తణుకు టౌన్: తణుకు సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిషా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యాన సంచార వైద్యశాల ద్వారా ప్రతి ఆదివారం నిర్వహించే ఉచిత వైద్య సేవల్లో భాగంగా తణుకులోని సంధ్యా జ్యోతి వృద్ధాశ్రమంలోని 20 మంది వృద్ధులకు వైద్య సేవలందించినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.కరుణాకర్ చౌదరి తెలిపారు. నేత్ర వైద్యుడు డాక్టర్ హుస్సేన్ అహ్మద్, జనరల్ వైద్యుడు సుంకవల్లి నీలు మహేంద్ర ఆశ్రమంలోని వృద్ధులకు కంటి పరీక్షలు, జనరల్ వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్య సూచనలు, సలహాలను అందించారు. అసోసియేషన్ సభ్యుడు సూరపనేని సత్యనారాయణరావు ఆర్థిక సహకారంతో ఉచితంగా మందులను పంపిణీ చేసినట్లు చెప్పారు. ఆశ్రమ పెద్దలు రాధమ్మ, నిర్వాహకురాలు చిట్టూరి సుజాత, అసోయేషన్ కార్యదర్శి కేవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు

ఉండి: మండలంలోని పాములపర్రులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. గణపవరం రోడ్డులో పాములపర్రు వద్ద ఉండి వైపు నుంచి వస్తున్న ద్విచక్ర వాహనాన్ని భీమవరం వైపు వెళుతున్న లారీ ఢీకొట్టడంతో ద్విచక్ర వాహనదారుడి కాలు విరిగింది. దీంతో అతన్ని భీమవరం ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. బాధితుని సోదరుడు దుర్గారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై ఎం.లక్ష్మణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత అదృశ్యం

ఉండి: వివాహిత అదృశ్యంపై కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉండి భవానిపేట యానాదుల కాలనీకి చెందిన మర్రి ఝాన్సీ ఈనెల 9వ తేదీన తన 8 నెలల కుమారుడిని తీసుకుని ఇంటి నుంచి ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లింది. ఆమె తిరిగి రాలేదు. దీంతో భర్త ప్రసాద్ ఆమె ఆచూకీ కోసం వెతికినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదుపై హెడ్ కానిస్టేబుల్ యెషయా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వైభవంగా నరేంద్రస్వామి కల్యాణం

పెనుమంత్ర: మండలంలోని భట్లమగుటూరు ఉన్న శ్రీరాజనరేంద్రస్వామి శ్రీబాల త్రిపుర సుందరీదేవి కల్యాణ మహోత్సవం ఆదివారం సాయంత్రం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ ముఖ మండపంలో ఆగమశాస్త్ర విధానంలో హర్షభట్టు రామరాజు ఆధ్వర్యంలో కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. భక్తులు కల్యాణాన్ని తిలకించారు.

ఘంటసాల పాటలు అజరామరం


తాడేపల్లిగూడెంలో ఘంటసాలకు నివాళులర్పిస్తున్న కళాకారులు, పట్టణ ప్రముఖులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): తెలుగు సినీ సంగీతంలో విభిన్నమైన వ్యక్తి ఘంటసాలని, ఆయన పాడిన పాటలు అజరామరాలని ఘంటసాల గానసభ అధ్యక్షుడు ఎస్.కాసిం, బీవీఆర్ వ్యవస్థాపకుడు బుద్దాల వెంకట రామారావు, అంతర్జాతీయ శిల్పి దేవికారాణి ఉడయార్ కొనియాడారు. ఘంటసాల 50వ వర్ధంతి సందర్భంగా ఆదివారం స్థానిక వీకర్స్ కాలనీలోని ఘంటసాల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గానసభ కార్యదర్శి డి.కృష్ణ, తబలా విద్వాన్ శంకరరావు, డి.బాలాజీ, సిల్క్ సాహెబ్, జీజేకే మూర్తి (హైదరాబాద్), యువ గాయకులు నజీరుద్దీన్, మన్సూర్, నాగూర్, సీరా కొండలరావు, రాంబాబు, బాబూరావు హాజరయ్యారు. సాయంత్రం బీవీఆర్‌లో ఘంటసాల గానసభ ఆధ్వర్యాన సంగీత విభావరి నిర్వహించారు. జిత్ మోహన్ మిత్ర ఆర్కెస్ట్రా వ్యవస్థాపకుడు, సినీ నటుడు, ప్రఖ్యాత గాయకుడు శ్రీపాద జిత్ మోహన్ మిత్రా (రాజమండ్రి)కు ఘంటసాల అవార్డు ప్రదానం, నాదస్వర విద్వాంసులు నాగూర్ సాహెబ్, మదీన్ బీబీ అవార్డును బీవీఆర్ కళాకేంద్రం సహాయ కార్యదర్శి, ప్రముఖ నర్తకుడు, నటుడు పీటీ వెంకన్నకు అందజేశారు. కళాకారులు, కళాభిమానులు పాల్గొన్నారు.

మధుర గాయకుడు ఘంటసాల

తణుకు టౌన్: తెలుగు సినీ సాహిత్యంలో మధుర గాయకుడు ఘంటసాల పాటలు చిరస్మరణీయంగా నిలుస్తాయని పలువురు వక్తలు కొనియాడారు. ఆదివారం ఘంటసాల వెంకటేశ్వరరావు వర్ధంతి సందర్భంగా తణుకులోని ఎన్టీఆర్ పార్క్ వద్ద గల ఆయన విగ్రహానికి మాజీ కౌన్సిలర్ వావిలాల సరళాదేవి ఆధ్వర్యాన పూలమాల వేసి నివాళులర్పించారు. గాయకుడు ఘంటసాల పాటలపై పలువురు వక్తలు మాట్లాడారు. కార్యక్రమంలో వావిలాల వెంకట పవన్ కుమార్, ఆర్కెస్ట్రా రాజు, సితారె, షణ్ముఖి విజయకుమార్ రాజు, మిమిక్రీ రాము, పి.లక్ష్మి, వరహాలు, రమణ తదితరులు పాల్గొన్నారు.

మధుమేహ వ్యాధి పట్ల అశ్రద్ధ వద్దు


వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): మధుమేహ వ్యాధి పట్ల అశ్రద్ధ చూపవద్దని లయన్స్ క్లబ్ జోన్ చైర్‌పర్సన్ పేరిచర్ల మురళీ కృష్ణంరాజు సూచించారు. స్థానిక ఆర్ అండ్ బీ గ్రౌండ్‌లో ఆదివారం డైమండ్స్ క్లబ్ ఆధ్వర్యాన పాలకొల్లు విజయ ల్యాబ్ అధినేత కొమ్ముల మురళీకృష్ణంరాజు సౌజన్యంతో ఉచిత మధుమేహ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. వాకర్స్, షటిల్ ప్లేయర్స్, ఫైర్ సిబ్బందికి రక్త పరీక్షలు చేశారు. మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ అన్ని వయస్సుల వారిని బాధిస్తున్న మహమ్మారి మధుమేహమని, గుర్తించగానే నియంత్రణపై శ్రద్ధ చూపాలని, నడక, తగిన వ్యాయమం, యోగా ఎంతో అవసరం అన్నారు. ఆహారపు అలవాట్లలో మార్పులు చేసుకోవాలని కోరారు. షుగర్ వ్యాధి ఉంటే నిపుణులైన వైద్యులను సంప్రదించాలని సూచించారు. కంచర్ల ఆయుర్వేదం నిర్వాహకులు కంచర్ల నరసింహ షుగర్ వ్యాధిగ్రస్తులకు హెర్బల్ మందును ఉచితంగా అందజేశారు. మానేపల్లి కిరణ్, జి.మురళీకృష్ణ, యర్రా ఆంజనేయస్వామి, కుందుం వెంకటేశ్వరరావు, రెడ్డి సత్యనారాయణ, డి.ముఖర్జీ, పి.రామకృష్ణ అభయం, లయన్స్ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిరోజూ వ్యాయామం తప్పక చేయాలి


సమావేశంలో పాల్గొన్న అసోసియేషన్ అధ్యక్షుడు దూలం నాగరాజు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రతిరోజూ వ్యాయమం తప్పక చేయాలని వాకర్స్ అధ్యక్షుడు దూలం నాగరాజు అన్నారు. పట్టణంలో ఆదివారం వాకర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం జరిగింది. నాగరాజు మాట్లాడుతూ ఆరోగ్యం కోసం నడక, రన్నింగ్, యోగా, వ్యాయమాలు చేయాలని సూచించారు. ఇటీవల దివంగతులైన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు, అసోసియేషన్ లైఫ్ సభ్యుడు పీఎల్ఎన్ మాస్టార్ స్మృత్యర్థం మౌనం పాటించారు. కార్యదర్శి చిప్పాడ గురుమూర్తి, కోశాధికారి మల్లారెడ్డి సారథి, జిల్లా డిప్యూటీ గవర్నర్ ప్రవా శ్రీనివాస్, పూర్వ అధ్యక్షుడు కేవీ చలం, రాగిరెడ్డి నాగ వరప్రసాద్, బాకా వెంకటేశ్వరరావు, పి.కుమారస్వామి, ఏఆర్‌కే సత్యనారాయణ మూర్తి, కోపల్లె శ్రీనివాస్, యోహాను, జి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలనకు చిరునామా సీఎం జగన్


జనరిక్ మందుల షాపును ప్రారంభిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

ఉండి: పేదల సంక్షేమానికి చిరునామా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన అని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. ఆదివారం ఆయన స్వగ్రామం యండగండిలో విశాల సహకార సంఘం ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన జనరిక్ మందులషాపు, ఏటీఎంను ప్రారంభించారు. ఈ సందర్భంగా పీవీఎల్ మాట్లాడుతూ పేదలు, రైతుల పక్షాన నిలబడి వారికి మరింత మంచి జరిగేలా యండగండి గ్రామంలో సహకార సంఘం ఆధ్వర్యాన జనరిక్ మందుల షాపును ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ప్రజలంతా ఈ మందుల షాపును వినియోగించుకోవాలని సూచించారు. బ్యాంక్ కార్యదర్శి సీహెచ్ రవికుమార్ మాట్లాడుతూ గతంలో మొబైల్ ఏటీఎంను ఏర్పాటు చేశామని, ఇప్పుడు బ్యాంక్ ఆవరణలో ఏటీఎం రైతులు, ఖాతాదారులకు నిరంతరం అందుబాటులో ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో బ్యాంకు పాలకవర్గ సభ్యులు దాట్ల కామరాజు, పైడి రామారావు, ఖాతాదారులు, రైతులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

మత్తు రహిత సమాజాన్ని స్థాపించాలి


భీమవరంలో రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ముహమ్మద్ సిద్దీఖ్

భీమవరం: జమాతే ఇస్లామి హింద్ సంస్థ నిర్వహిస్తున్న 'రండి! మత్తు రహిత సమాజాన్ని స్థాపిద్దాం' రాష్ట్ర వ్యాప్త అవగాహన ఉద్యమంలో భాగంగా ఆదివారం భీమవరం పట్టణంలోని ముస్లిమ్స్ కమ్యూనిటీ హాల్లో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. పట్టణ అధ్యక్షుడు సయ్యద్ ఫర్హాన్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో పట్టణ ఉద్యమ కన్వీనర్ ముహమ్మద్ సిద్దీఖ్ మాట్లాడుతూ సమాజంలో మత్తు పదార్థాల వినియోగం, డ్రగ్స్ లాంటి మాదక ద్రవ్యాల వినియోగం విపరీతంగా పెరిగిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. మాదక ద్రవ్యాల ప్రభావం వల్ల అనేకమంది మానసిక, శారీరక వ్యాధులకు గురి కావడమేగాక సమాజంలో నేరాలు, ఘోరాలు కూడా పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల వాడకం వల్ల కలిగే అనర్థాల గురించి అవగాహన కల్పించడానికి ఈ నెల 18వ తేది వరకూ అవగాహన ఉద్యమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భీమవరం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు యేలేటి న్యూటన్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగంపై ప్రభుత్వాలు నిషేధం విధించి నివారణ చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ కరీముల్లా, గంగయ్య, కె క్రాంతిబాబు, విశాలాక్షి, మునవర్ కమాల్ పాషా, జి ధనుష్, అబ్దుల్ వహీద్ తదితరులు పాల్గొన్నారు.